

విద్వేషాలు రెచ్చగొట్టొద్దు: డీఎస్పీ


పాలకొండ: సోషల్ మీడియా లేదా వాట్సాప్‌ల్లో విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ఎవరూ సందేశాలు, ఫొటోలు పోస్టు చేయరాదని పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణా రావు తెలిపారు. అలా చేస్తే ఆ గ్రూప్ అడ్మిన్స్ పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. శనివారం ఆయన స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ.. ఎగ్జిట్ పోల్స్ తర్వాత సోషల్ మీడియాలో ఎటువంటి పోస్టులు పెట్టరాదన్నారు. ఎవరైనా రెచ్చగొట్టే ధోరణిలో సందేశాలు, ఫొటోలు పంపితే గ్రూప్ అడ్మిన్‌పై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని సూచించారు.

కూటమిదే పీఠం!

- టీడీపీ, బీజేపీ, జనసేనకు అనుకూలంగా మెజారిటీ ఎగ్జిట్ పోల్స్
- వైసీపీకి తక్కువ స్థానాలిచ్చిన సర్వే సంస్థలు
- జిల్లాలో రెండు స్థానాల్లో టీడీపీ గెలుపు తథ్యం
- మరో రెండు నియోజకవర్గాలో గట్టి పోటీ
- ఆనందంలో ఎన్డీఏ కూటమి శ్రేణులు
- వైసీపీ నాయకుల్లో నిరుత్సాహం

పార్వతీపురం, జూన్1 (ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమే అధికారంలోకి వస్తుందని పలు సంస్థలు ఎగ్జిట్‌పోల్స్ ద్వారా ప్రకటించాయి. శనివారం సాయంత్రం ఆరున్నర గంటల తర్వాత ఎగ్జిట్‌పోల్స్ విడుదలయ్యాయి. పయనీర్, ఏబీపీ సీ ఓటరు, పీపుల్ పల్స్ రైస్ పొలిటికల్ రీసెర్చ్, న్యూస్ ఎక్స్, చాణక్య స్ట్రాటజీస్, పీటీఎస్ గ్రూపు, ప్రిజమ్, ఇండియా టుడే తదితర సర్వే సంస్థలన్నీ ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిదే అధికారమని తేల్చి చెప్పాయి. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని మెజార్టీ ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు స్పష్టం చేశాయి. రాష్ట్రంలో 175 అసెంబ్లీ సీట్లకు గాను టీడీపీ కూటమికి 113 నుంచి 122 సీట్లు వస్తాయని రైజ్ సంస్థ వెల్లడించింది. అదే విధంగా చాణక్య స్ట్రాటజీస్ సర్వే ప్రకారం 114 నుంచి 125 సీట్లు, పయనీర్ సర్వేలో 1144 సీట్లు పైబడి కూటమికి వస్తాయని అంచనా. ఇక జనగళం సర్వే ప్రకారం 104 నుంచి 118 సీట్లు, కేకే సర్వేస్‌లో టీడీపీ కూటమి 133 సీట్లు గెలుపొందనున్నట్లు ఆయా సంస్థలు తేల్చి చెప్పాయి. దీంతో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం తేదీ ఖరారు చేయడమే ఆలస్యమని, ఈ నెల నాలుగో తేదీ ఓట్ల లెక్కింపు అనంతరం వైసీపీ ప్రభుత్వం ఇంటికి వెళ్లడం ఖాయమని భావిస్తున్నాయి. మొత్తంగా జిల్లాలో ఎక్కడా చూసినా ఎగ్జిట్ పోల్స్‌పైనే చర్చలు సాగుతున్నాయి.



నిరుత్సాహంలో వైసీపీ శ్రేణులు..

మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ అన్నీ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి అనుకూలంగా ఉన్నాయి. దాదాపు అన్ని ప్రముఖ సర్వే సంస్థలూ వైసీపీకి తక్కువ సీట్లు వస్తాయని పేర్కొన్నాయి. దీంతో వైసీపీ నాయకులు, కార్యకర్తలు నిరుత్సాహానికి గురయ్యారు. ఇప్పటివరకు బెట్టింగ్‌లు వేసిన కొంతమంది ఆ పార్టీ నేతలు ఇప్పుడు వెనకడుగు వేస్తున్నారు. తిరిగి తమ బెట్టింగ్ డబ్బులను వాపస్ చేయాలని, ఎంతో కొంత తీసుకొని మిగతా సొమ్ము ఇప్పించాలని బతిమలాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సర్వేలన్నీ వైసీపీకి వ్యతిరేకంగా ఉండడంతో ఇక పందాలు వేసుకొని డబ్బులు పోగొట్టుకోవడం ఎందుకని ఇంకొంతమంది భావిస్తున్నారు.

పోస్టల్ బ్యాలెట్లతో మెజార్టీ...

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో అత్యధికంగా పోస్టల్ బ్యాలెట్ల ఓట్లు కూటమి అభ్యర్థులకే పడ్డాయని జోరుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే పోస్టల్ బ్యాలెట్లకు సంబంధించి ఎన్నికల సంఘం జారీ చేసిన ఆదేశాలపై వైసీపీ కోర్టుకు వెళ్లడంతో ఆ ఓట్లు కూటమికే అనుకూలమని స్పష్టమైంది. ఏదేమైనా పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో కూటమి అభ్యర్థులకు మరింత మెజార్టీ రానుందని టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు భావిస్తున్నాయి.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం..

జిల్లాలో పూర్ణపాడు-లాబేసు వంతెన, సీతానగరం వంతెన, వీరఘట్టంలో రహదారులు, సాలూరు నుంచి మక్కువ రహదారితో పాటు అనేక అభివృద్ధి పనులకు గత ఐదేళ్లలో పూర్తిస్థాయిలో నిధులు మంజూరు కాలేదు. దీంతో ఆయా నిర్మాణాలు మధ్యలోనే నిలిచి పోయాయి. చక్కెర కర్మాగారాన్ని తెరిపించడంలోనూ వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. అయితే ఈ విషయాలను కూటమి శ్రేణులు బలంగా క్షేత్రస్థాయికి తీసుకెళ్లారు. కీలకమైన వ్యవసాయ రంగంలో కాని, పారిశ్రామిక రంగంలో కాని పర్యాటకం, ఉపాధి, వైద్యం వంటి ముఖ్యమైన రంగాల్లో ఎలాంటి అభివృద్ధి లేకపోవడాన్ని ప్రజ లంతా గుర్తించారని ఈ ఎగ్జిట్ ఫలితాలు తేటతెల్లం చేశాయి. ఎన్నికల్లో కూటమి నేతల ఐకమత్యాన్ని కూడా అంతా గుర్తించారు. వీరొస్తేనే ప్రజలకు ఉపయోగం ఉంటుందని భావించినట్లు తెలుస్తోంది.

కూటమి శ్రేణుల్లో జోష్..

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు గాను రెండు స్థానాల్లో కూటమి అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుస్తారని వివిధ సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. మరో రెండు స్థానాల్లో వైసీపీ, కూటమి అభ్యర్థుల మధ్య గట్టి పోటీ ఉందని ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి. ఏదేమైనా జిల్లాలో కూటమి అభ్యర్థులు విజయ పథంలో నడుస్తారని వివిధ సర్వేలు స్పష్టం చేయడంతో 'మన్యం'లో టీడీపీకి పూర్వ వైభవం తిరిగి రానుందని నాయకులు, కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎగ్జిట్‌పోల్స్ కూటమికి అనుకూలంగా ఉండడంతో టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆనందంలో మునిగిపోయారు. తమ ప్రభుత్వం వస్తుందని భావిస్తున్నారు. ఫలితాలు తమకు అనుకూలంగా ఉంటా యనడానికి ఎగ్జిట్ పోల్సే నిదర్శనమని వారు చెబుతున్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాతే మళ్లీ అసెంబ్లీలో అడుగుపెడతానని టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన శపథం నెరవేరనుందని భావిస్తున్నారు.

- గత ఐదేళ్లు జిల్లాలో ఏ కోశానా అభివృద్ధి లేదని, చెప్పుకోదగ్గ ప్రాజెక్టు కాని, పరిశ్రమ కాని రాలేదని, ఉపాధి కూడా మృగ్యమైపోయిందన్న విషయాన్ని ప్రజలంతా గ్రహించారనేది కూటమి నేతల అభిప్రాయం. తీర్పు కూడా ఆ వైపుగానే ఉంటుందని ముందు నుంచి చెబుతూ వస్తున్నారు. వారి అభిప్రాయాలకు దగ్గరగా ఎగ్జిట్ పోల్స్ రావడంతో ఊరట చెందుతున్నారు.

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

పార్వతీపురం టౌన్ /గరుగుబిల్లి, జూన్ 1: జిల్లాలో కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు సర్వ సిద్ధం చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ తెలిపారు. గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర ఉద్యాన కళాశాలలో కౌంటింగ్ కేంద్రాలను శనివారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల వద్ద, కౌంటింగ్ కేంద్రాల్లో మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా ఉంటుందని తెలిపారు. జిల్లాలోని 4 అసెంబ్లీ నియోజకవర్గాలకు 14 టేబుల్స్ తో పాటు అరకు పార్లమెంట్‌కు 20 టేబుల్స్ ఏర్పా టు చేశామని వెల్లడిం చారు. కౌంటింగ్ రోజు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు లో ఉంటుందని చెప్పారు. కౌంటింగ్ హాల్‌లోకి మొబైల్ ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ డివైజ్‌లు అనుమతించబోమని తెలిపారు. ఫలితాలు వెల్లడైన తర్వాత ర్యాలీలు, విజయోత్సవాలు చేయరాదని స్పష్టం చేశారు. జేసీ శోభిక, ఆర్డీవో హేమలత తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

కోతలే కోతలు!

- జిల్లాలో అనధికార విద్యుత్ కోతలు
- గంటల తరబడి సరఫరా నిలిపివేత
- గాలి వీచినా.. వర్షం పడినా ఇక అంతే..
- చీకట్లోనే పల్లెలు.. రాత్రంతా జాగారం
- పట్టణ ప్రాంతాల్లోనూ దారుణ పరిస్థితి
- కరెంట్ ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు పోతుందో తెలియని వైనం
- ఎండ వేడి, ఉక్కపోతకు జనం విలవిల





భామిని విద్యుత్ సబ్‌స్టేషన్

(పార్వతీపురం, జూన్1 (ఆంధ్రజ్యోతి)/పార్వతీపురం రూరల్/ కురుపాం/ భామిని/ పాచిపెంట)

జిల్లాలో విద్యుత్ కోతలు తీవ్రమయ్యాయి. రాత్రి, పగలు అని తేడా లేకుండా.. ఎప్పుడుపడితే అప్పుడు గంటల తరబడి సరఫరాను నిలిపేస్తున్నారు. అసలు కరెంట్ ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. మరోవైపు గాలి వీచినా.. వర్షం పడినా కరెంట్ ఉండడం లేదు. దీంతో గ్రామాలు చీకట్లోనే ఉండాల్సి వస్తోంది. రాత్రంతా పల్లెవాసులు జాగారం చేయాల్సి వస్తోంది. ఒకవైపు ఎండ వేడి.. మరోవైపు ఉక్కపోత, దోమల బెడదతో జిల్లావాసులు నానా అవస్థలు పడుతున్నారు. వర్షం కురిసిన సమయాల్లో వాతావరణం చల్లబడినా.. ప్రజలకు ఊరట లభించడం లేదు. విద్యుత్ సరఫరా ఉండకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో అనధికారంగా విద్యుత్ కోతలు అమలవుతున్నా.. అటువంటిదేమీ లేదని ఆ శాఖాధికారులు చెబుతుండడం విశేషం. ఎటువంటి అంత రాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామని వారు తెలియజేస్తున్నారు. అయితే దీనిపై జిల్లావాసులు మండిపడుతున్నారు. విద్యుత్ కోతలపై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.


వివిధ చోట్ల ఇలా..

- పార్వతీపురం, కురుపాం, కొమరాడ, సీతంపేట, మక్కువ తదితర మండలాల్లోని పలు గ్రామాలతో పాటు పార్వతీపురం టౌన్‌లో రోజుకు గంటల తరబడి అనధికారికంగా విద్యుత్ కోతలు అమలు చేస్తున్నారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో రెండేసి గంటల చొప్పున, రాత్రి వేళల్లో మూడు గంటలకు పైగా సరఫరా నిలిపేస్తున్నారు. అర్ధరాత్రి వేళల్లో కరెంట్ తీసేస్తుండగా.. తిరిగి ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి. పల్లెల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. కరెంట్ సరఫరా ఇలా ఉండగా.. బిల్లులు మాత్రం అధిక మొత్తంలో వస్తుండడంతో ప్రజలు లబోదిబోమంటున్నారు.
- పార్వతీపురం మండలంలో కొద్ది రోజులుగా ఓవర్‌లోడ్ పేరిట లక్ష్మీనారాయణపురం, పెదమరికి తదితర గ్రామాల్లో ఇష్టారాజ్యంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. గత నెల 29న ఆయా గ్రామాల్లో రాత్రి 9 గంటలకు నిలిచిపోయిన విద్యుత్ సరఫరా తిరిగి తెల్లవారిజామున మూడున్నర గంటలకు వచ్చింది. గత నెల 30న లక్ష్మీనారాయణపురంలో రాత్రి వేళల్లో చాలాసేపు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గత నెల 31న పార్వతీపురం మండలంలో అనేక గ్రామాల్లో రాత్రి 9 గంటల నుంచి అర్ధరాత్రి వరకు కరెంట్ లేదు. దీనిపై సంబంధిత అధికారులకు ప్రజలు ఫోన్ చేయగా.. ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ (ఈఎల్ఆర్) కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందని చెప్పుకొచ్చారు. జిల్లా కేంద్రానికి అతి సమయంలో ఉన్న గ్రామాల పరిస్థితి ఇలా ఉంటే.. ఇక ఏజెన్సీ ప్రాంతంలో ఇంకెలా ఉంటుందో వేరేగా చెప్పక్కర్లేదు. ఇక బలిజిపేట, సీతానగరం మండలాల్లోని పలు గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ పేరిట అనధికారంగా కోతలను విధిస్తుండడంతో. గ్రామీణ ప్రాంతవాసులకు కంటి మీద కునుకు కరువవుతోంది.
- కురుపాంలో శుక్రవారం సాయంత్ర 5 గంటల సమయంలో ఈదురుగాలులతో వర్షం కురవడంతో రాత్రి అంతా గ్రామం అంధకారంలోనే ఉంది. తెల్లవారు జామును 4 గంటల సమయంలో కరెంట్ సరఫరాను పునరుద్ధరించారు. గత రెండు రోజులుగా మధ్యాహ్నం, రాత్రి వేళల్లో గంటల తరబడి కరెంట్ ఉండడం లేదు. రాత్రి పూట లోఓల్టేజ్ కారణంగా ఫ్యాన్‌లు, బల్బులు సరిగ్గా పనిచేయడం లేదని మండల వాసులు వాపోతున్నారు.
- భామిని మండలంలో ఏ మాత్రం గాలులు వీచినా వెంటనే విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. కొత్తూరు నుంచి వచ్చిన 33 కేవీ విద్యుత్ లైన్ నుంచి సరఫరా నిలిచిపోవడంతో తిరిగి ఎంత సమయానికి కరెంట్ వస్తుందో తెలియని పరిస్థితి. భామినిలో 30 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ సరిగ్గా పనిచేయకపోవడంతో ప్రజలకు లో ఓల్టేజ్ సమస్య తప్పడం లేదు. కొరమ, చిన్నదిమిలి, పెద్దదిమిలి, ఘనసర, బాలేరు తదితర గ్రామాల్లో ప్రజలు రాత్రిపూట గంటల తరబడి విద్యుత్ కోసం ఎదురుచూడాల్సి వస్తోంది.
- పాచిపెంటలో గత రెండు రోజులుగా రాత్రి వేళల్లో విద్యుత్ కోతలు అమలు చేస్తున్నారు. శుక్రవారం రాత్రి 10 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. రాత్రి 12 గంటల నుంచి ఒంటి గంట వరకు కోత విధించారు. ఒక్కోరోజు ఒక్కో సమయంలో కోతలు అమలు చేస్తున్నారు.

పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా..

పార్వతీపురం మన్యం జిల్లాలో పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా జరుగుతుంది. ఎటువంటి విద్యుత్ కోతలు లేవు. కొన్ని సాంకేతిక సమస్యల వల్ల అక్కడక్కడా సరఫరా నిలిచిపోయే పరిస్థితి ఉంటే.. స్థానికంగా ఉన్న విద్యుత్ శాఖాధికారులు స్పందించి వెంటనే సరఫరాను పునరుద్ధరిస్తున్నారు.

-ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్, ఉమ్మడి జిల్లా



శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8:30 గంటల వరకు చీకటిలోనే ఉన్న పాలకొండ

పొరుగు జిల్లా బ్యాంకులో పింఛన్ జమ

- అయినా గత నెల అందని సొమ్ము
- ఈ నెల ఏం చేస్తారోనని ఓ పింఛన్‌దారు ఆందోళన



ఈమె పేరు వల్లూరు చిన్నమ్మ. సాలూరులో నివాసం ఉంటోంది. 22వ వార్డుకు చెందిన ఆమె సామాజిక వితంతు పింఛను పొందుతోంది. కాగా గత నెల పింఛన్ల సొమ్మును బ్యాంకు ఖాతాల్లో జమచేసిన విషయం తెలిసిందే. అయితే చిన్నమ్మకు సాలూరు బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఖాతా ఉండగా విజయనగరం ఐసీఐసీఐ బ్యాంక్‌లో పింఛను జమ అయినట్టు చూపించారు. దీంతో ఆమె ఈసురోమంటూ విజయనగరంలో ఆ బ్యాంక్‌కు వెళ్లి ఆధార్ తదితర పత్రాలు సమర్పించారు. ఆ తర్వాత ఆ బ్యాంకు అధికారులు ఆమెను బొబ్బిలి వెళ్లమన్నారు. తీరా అక్కడకు వెళ్లినా చిన్నమ్మకు డబ్బులు ఇవ్వలేదు. సచివాలయానికి వెళ్లినా ఫలితం దక్కలేదు. ఈ నేపథ్యంలో మరి ఈ నెల పింఛను ఏమి చేస్తారోనని ఆమె ఆందోళన వ్యక్తం చేస్తోంది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తనకు పింఛను డబ్బులు అందించే విధంగా చూడాలని ఆమె శనివారం కోరింది. ఇదిలా ఉండగా సాలూరుకు చెందిన గొట్టాపు సరస్వతి వృద్ధాప్య పింఛను సొమ్ము తెలంగాణ రాష్ట్రం నల్గొండ బ్యాంక్‌లో జమైంది. దీనిపై ఇప్పటికే ఆమె డీఆర్‌డీఏ అధికారులకు ఫిర్యాదు చేసింది.

- సాలూరు రూరల్

విద్యుత్ లేని పీవీటీజీ గ్రామాలు ఉండరాదు

- ట్రాన్స్‌కో సీఎండీ పృథ్వీతేజ్



లకాయగూడలో పరిశీలిస్తున్న సీఎండీ

సీతంపేట: జిల్లాలో విద్యుత్ సౌకర్యం లేని పీవీటీజీ (ప్రత్యేక ఆదిమ గిరిజన గ్రూప్) గ్రామాలు ఉండకూడదని ట్రాన్స్‌కో సీఎండీ పృథ్వీతేజ్ స్పష్టం చేశారు. శనివారం సీతంపేట మండలంలో లకాయిగూడ, రాయ మానుగూడ గిరిజన గ్రామాల్లో ఆయన పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి గిరిజన గ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్లకు జియోట్యాగింగ్ చేశామన్నారు. వాటిల్లో విద్యుత్ సౌకర్యం నోచుకోని వారిని గుర్తించామన్నారు. ఇటువంటి వారికి విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు. అనంతరం జియోట్యాగింగ్ అమలును పరిశీలించారు. గిరిజన గ్రామాల్లో లోఓల్టేజ్ సమస్య లేకుండా చూడాలని, నిరంతరం విద్యుత్ సరఫరా అందించాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ కృష్ణమూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోపాలకృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.



పాలకొండ: ప్రత్యేక అలంకరణలో దక్షిణాముఖ ఆంజనేయస్వామి



సాలూరు రూరల్: సాలూరు పెదకోమటిపేట రామాలయంలో..



వీరఘట్టంలో పూజలు చేస్తున్న దృశ్యం

శ్రీ ఆంజనేయం

- ఘనంగా హనుమాన్ జయంతి
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

హనుమాన్ జయంతి వేడుకలను జిల్లావాసులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం ఉదయాన్నే ఆంజనేయ స్వామి ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కొన్నిచోట్ల హనుమాన్ చాలీసా పఠించారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పాలకొండ పట్టణంలోని దక్షిణాముఖ ఆంజనేయ స్వామి రాత్రి 8గంటల వరకు నిజరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. వీరఘట్టం మండలంలోని పలు గ్రామాల్లో తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం ప్రసాదాల పంపిణీ చేపట్టారు. వివిధ చోట్ల అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కడకెల్లలో నిర్వహించిన పూజా కార్యక్రమాలకు సమీప గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. సాలూరు అర్బన్, రూరల్‌లోనూ అంజనేయ స్వామి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. హనుమాన్ చాలీసాను 108 సార్లు సామూహిక పారాయణం, నారాయణసేవ నిర్వహించారు. పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాలతో పాటు 15 మండలాల్లోనూ హనుమాన్ జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. దీంతో అంతటా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.

-(ఆంధ్రజ్యోతి బృందం)



వీరఘట్టం: కడకెల్లలో పూజలో పాల్గొన్న భక్తులు

నిట్ తిరుచిరాపల్లిలో పీహెచ్‌డీ

దిక్సూచి DIKSUCHI



తిరుచిరాపల్లిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)- పీహెచ్‌డీ 2024 జూలై సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫుల్ టైం, పార్ట్ టైం విధానాలు అందుబాటులో ఉన్నాయి. ఇనీషియల్ స్ర్కీనింగ్, రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూ, కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మొత్తం 146 సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఫుల్ టైం ప్రోగ్రామ్‌లో చేరిన వారు గరిష్ఠంగా ఆరేళ్లలో; పార్ట్ టైం అభ్యర్థులు గరిష్ఠంగా ఏడేళ్లలో పూర్తి చేయవచ్చు.

విభాగాలు-సీట్లు: ఆర్కిటెక్చర్ 8, కెమికల్ ఇంజనీరింగ్ 8, కెమిస్ట్రీ 7, సివిల్ ఇంజనీరింగ్ 13, కంప్యూటర్ అప్లికేషన్స్ 8, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 10, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ 11, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ 13, ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ 3, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ 5, ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్ 7, మేనేజ్‌మెంట్ స్టడీస్ 7, మేథమెటిక్స్ 8, మెకానికల్ ఇంజనీరింగ్ 13, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ 8, ఫిజిక్స్ 6, ప్రొడక్షన్ ఇంజనీరింగ్ 11 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి సంబంధిత ఇంజనీరింగ్/ఆర్కిటెక్చర్/ప్లానింగ్/డిజైన్ విభాగాల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు ఎంఈ/ఎంటెక్/ఎంఎస్ రీసెర్చ్ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్ విభాగాలకు పీజీ(హ్యూమానిటీస్/సోషల్ సైన్స్/ఎకనామిక్స్/బిజినెస్ అడ్మినిస్ట్రేషన్/కామర్స్/స్టాటిస్టిక్స్) పూర్తి చేసి ఉండాలి. మేథమెటిక్స్‌కు (మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్)(ఎంఏ/ఎమ్మెస్సీ); ఫిజిక్స్‌కు పీజీ(ఫిజిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/ మెటీరియల్స్ సైన్స్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్); కెమిస్ట్రీకి పీజీ(కెమిస్ట్రీ/అప్లయిడ్ కెమిస్ట్రీ) పూర్తిచేసి ఉండాలి. విభాగాన్ని అనుసరించి డీఎస్‌టీ/డీఏఈ/ఎన్‌బీహెచ్ఎం/ఇన్‌స్పయిర్/యూజీసీ/సీఎస్ఐఆర్ ఫెలోషిప్ అర్హత ఉండాలి. గేట్/యూజీసీ నెట్/సీఎస్ఐఆర్ నెట్/ క్యాట్/ ఏఐఎంఏ/ ఎక్స్ఏటీ / వ్యాట్/ జీ వ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

ఫెలోషిప్

- మొత్తం 146 ఫుల్ టైమ్ హెచ్‌టీఆర్ఏ ఫెలోషిప్స్‌తోపాటు విశ్వేశ్వరాయ పీహెచ్‌డీ స్కీమ్ కింద ఎలక్ట్రానిక్స్ & ఐటీ విభాగాల్లో మరో 5 ఫెలోషిప్స్ ఉన్నాయి.
- ఫుల్ టైం ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులకు నిబంధనల ప్రకారం అయిదేళ్లపాటు ఫెలోషిప్ అందిస్తారు. మొదటి రెండేళ్లు నెలకు రూ.37,000; తరవాత మూడేళ్లు నెలకు రూ.42,000 ఇస్తారు. అభ్యర్థులు వారానికి ఎనిమిది గంటలపాటు రీసెర్చ్ గైడ్‌గా వ్యవహరిస్తూ హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్ సూచనల ప్రకారం అకడమిక్ వర్క్ పూర్తి చేయాల్సి ఉంటుంది. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారికి పీఎంఆర్ఎఫ్ ఫెలోషిప్ వర్తిస్తుంది.
- విశ్వేశ్వరాయ ఫెలోషిప్ కింద మొదటి రెండేళ్లు నెలకు రూ.38,750; తరవాత మూడేళ్లు నెలకు రూ.43,750 ఇస్తారు. హాస్టల్ సౌకర్యం లభించని వారికి ఫెలోషిప్ మొత్తంలో 16 శాతాన్ని రీయింబర్స్‌మెంట్ ఆఫ్ రెంట్(ఆర్ఓఆర్)గా ఇస్తారు. రీసెర్చ్ కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.1.2 లక్షలు; ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సపోర్ట్ కింద రూ.1.5 లక్షలు చెల్లిస్తారు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 11
- **రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూలు:** జూన్ 20 నుంచి 30 వరకు
- **వెబ్‌సైట్:** nitt.edu

ఐఐఎస్‌డబ్ల్యూబీఎంలో ఎంఎస్‌డబ్ల్యూ

కోల్‌కతాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ (ఐఐఎస్‌డబ్ల్యూబీఎం)- 'మాస్టర్స్ ఇన్ సోషల్ వెల్ఫేర్(ఎంఎస్‌డబ్ల్యూ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా క్లాస్ రూమ్ సెషన్స్, ప్రజంటేషన్స్, సెమినార్లు, సమ్మర్ ఇంటర్న్‌షిప్, ఫీల్డ్ వర్క్స్ ఉంటాయి. ఇది డ్యూయెల్ స్పెషలైజేషన్ ప్రోగ్రామ్. రిటెన్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి యూనివర్సిటీ ఆఫ్ కోల్‌కతా డిగ్రీని ప్రదానం చేస్తుంది.

స్పెషలైజేషన్‌లు: చైల్డ్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, కరెక్షనల్ సోషల్ వర్క్, కమ్యూనిటీ ఆర్గనైజేషన్ అండ్ డెవలప్‌మెంట్ ప్రాక్టీసెస్, లేబర్ వెల్ఫేర్

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఇంజనీరింగ్ సహా ఏదేని ప్రొఫెషనల్ డిగ్రీ/అయిదేళ్ల ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.700
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 26
- **రిటెన్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూన్ 28
- **రిటెన్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్స్, ఇంటర్వ్యూలు:** జూలై 10, 11
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 12
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఆగస్టు 28 నుంచి
- **వెబ్‌సైట్:** www.iiswbm.edu

ఎన్ఐఈపీఎండీలో డిప్లొమా

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఎండీ)- 'డిప్లొమా ఇన్ ఆఫీస్ ఆటొమేషన్ అండ్ అసిస్టివ్ టెక్నాలజీ' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనిని పర్సన్ విత్ ఇంటలెక్చువల్ డిజెబిలిటీ, ఆటిజం స్పెక్ట్రం డిజార్డర్, మెంటల్ ఇల్‌నెస్, స్పెసిఫిక్ లెర్నింగ్ డిజెబిలిటీ, మల్టిపుల్ డిజెబిలిటీస్ కేటగిరీలకు ప్రత్యేకించారు. దీనికి తిరుచిరాపల్లిలోని భారతీదాసన్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ డిఫరెంట్లీ ఏబుల్డ్ పర్సన్స్ గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 10 సీట్లు ఉన్నాయి. ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఎగ్జామ్‌కు సంబంధించిన మోడల్ పేపర్లను వెబ్‌సైట్‌లో చూడవచ్చు. చెన్నై క్యాంపస్‌లో స్టడీ సెంటర్ ఉంది.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జూన్ 15
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** పదోతరగతి సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, అభ్యర్థి ఫొటో, కమ్యూనిటీ సర్టిఫికెట్, డిజెబిలిటీ సర్టిఫికెట్
- **వెబ్‌సైట్:** www.niepmd.tn.nic.in


'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/1DWg1oeలో చదవండి.

కేదార్‌నాథ్‌లో తలైవా



నటుడిగా తను ఎంత బిజీగా ఉన్నా మధ్యలో వీలు చూసుకుని హిమాలయాలకు వెళ్లడం తలైవా రజనీకాంత్‌కు అలవాటు. కొన్ని రోజులు అక్కడే ధ్యానంలో గడుపుతుంటారు. అలాగే మే 29న ఆయన ఉత్తరాఖండ్ వెళ్లి కేదార్‌నాథ్, బదరీనాథ్ ఆలయాలు సందర్శించారు. ఈ సందర్భంగా ఉత్తరాఖండ్ పోలీసులు ఆయనకు స్వాగతం పలికి, దర్శనానికి ఏర్పాట్లు చేశారు. కేదార్‌నాథ్‌లో రజనీకాంత్ ఉన్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

సిద్ధమవుతున్న హరిహర వీరమల్లు



పవన్‌కల్యాణ్ తన కెరీర్‌లో తొలిసారిగా చేస్తున్న హిస్టారికల్ ఎపిక్ వారియర్‌మూవీ 'హరిహర వీరమల్లు'. 17 వ శతాబ్దంలో పేదల కోసం పోరాడిన యోధుడి పాత్రను ఆయన ఇందులో పోషిస్తున్నారు. క్రిష్ జాగర్లమూడి పర్యవేక్షణలో దర్శకుడు జ్యోతికృష్ణ బ్యాలెన్స్ షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేయబోతున్నారు. భారీ బడ్జెట్‌తో ఎ.ఎం.రత్నం ఈ సినిమా నిర్మిస్తున్నారు. భారతదేశంలోనే అత్యంత డిమాండ్ ఉన్న సినిమాటోగ్రాఫర్ మనోజ్ పరమహంస 'హరిహర వీరమల్లు' చిత్రానికి వర్క్ చేయనున్నారు. త్వరలోనే షూటింగ్‌ను ప్రారంభించే పనిలో నిర్మాత ఉన్నారు. ప్రస్తుతం లొకేషన్ల కోసం రెక్కీ నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకూ షూట్ చేసిన సన్నివేశాలకు సంబంధించిన వీఎఫ్ఎక్స్, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ ను కూడా శరవేగంతో పూర్తి చేస్తున్నారు. ఈ ఏడాది చివరికి 'హరిహర వీర మల్లు' పార్ట్ వన్ 'స్వార్డ్ వర్సెస్ స్పిరిట్'ను విడుదల చేయడానికి నిర్మాత సన్నాహాలు చేస్తున్నారు. నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో బాబీ డియోల్, సునీల్, నోరా ఫతేహి కీలక పాత్రలు పోషిస్తున్నారు.

యాక్షన్ ప్యాక్డ్ మూవీ

వైవిధ్యమైన చిత్రాలతో తెలుగు నాట అభిమానులను సంపాదించుకున్నారు తమిళ హీరో విజయ్ ఆంటోని. ఇప్పుడు ఆయన 'తుఫాన్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశలో ఉంది. ఈ నెల్లోనే



ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం ఇటీవలే టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా విజయ్ ఆంటోని మాట్లాడుతూ 'తుఫాన్' యాక్షన్ ప్యాక్డ్ మూవీ. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంది' అన్నారు. దర్శకుడు విజయ్ మిల్టన్ మాట్లాడుతూ "తుఫాన్ సినిమా కోసం రెండేళ్లు కష్టపడ్డాం. ఒక దీవిలో జరిగే కథ ఇది. హీరో క్యారెక్టరైజేషన్ సరికొత్తగా ఉంటుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది' అని చెప్పారు. ఈ చిత్రాన్ని కమల్ బోరా, డి. లలిత నిర్మిస్తున్నారు. సంగీతం: అచ్చు రాజమణి, విజయ్ ఆంటోని.



బ్లాక్‌బస్టర్ గ్యారంటీ

శర్వానంద్

"మనమే' చిత్రం మ్యాజికల్ బ్లాక్ బస్టర్. ఈ సారి కుమ్మేశాం. ఇది రాసి పెట్టుకోండి. ఈ నెల 7న థియేటర్లలో కలుద్దాం. ఇది కుటుంబం అంతా కలసి ఎంజాయ్ చేస్తూ చూసే సినిమా. 'శతమానం భవతి' కన్నా పెద్ద హిట్ అవుతుంది. మిమ్మల్ని ఏమాత్రం నిరాశపరచదు' అని శర్వానంద్ అన్నారు. ఆయన హీరోగా నటించిన చిత్రం 'మనమే'. కృతిశెట్టి కథానాయిక. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ నెల 7న విడుదలవుతోంది. శనివారం చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా శ్రీరామ్ ఆదిత్య మాట్లాడుతూ 'ట్రైలర్‌లో మీరుచూసింది కొంచెమే. 'మనమే' అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంది. మీ తల్లితండ్రులకు చూపించండి. ఈ సారి కొత్త శర్వాను చూడబోతున్నారు. కృతి తన నటనతో ఇరగదీసింది' అన్నారు. సినిమాలో ఎమోషన్‌తోపాటు ఎంటర్టైన్‌మెంట్ ఉంది అని కృతిశెట్టి చెప్పారు. ఈ సినిమా మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్, ప్రేక్షకులు ఆదరించాలి అని వివేక్ కూచిభొట్ల కోరారు.

డూప్ లేకుండా కాజల్ యాక్షన్ సీక్వెన్స్ చేశారు

- సుమన్ చిక్కాల



'ఎమోషన్, యాక్షన్ అంశాలతో 'సత్యభామ' చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. యాక్షన్ పార్ట్ కోసం కాజల్ అగర్వాల్ ఎంతో కష్టపడ్డారు. చాలా ధైర్యంగా స్టంట్స్ చేశారు' అని దర్శకుడు సుమన్ చిక్కాల అన్నారు. కాజల్ అగర్వాల్ పోలీసాఫీసర్‌గా నటించిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సుమన్ మీడియాతో మాట్లాడారు.

- సినిమాలపై ఆసక్తి ఉండడంతో ఉద్యోగం చేస్తూనే చిత్రపరిశ్రమలో అవకాశాల కోసం ప్రయత్నించాను. దర్శకుడు శశికిరణ్ తీసిన కొన్ని సినిమాలకు పనిచేశాను. ఆయన ఈ సినిమాకు దర్శకుడిగా నాకు అవకాశం ఇచ్చారు. కొంతమంది పోలీసుల జీవితాల్లో జరిగిన సంఘటనల ఆధారంగా కథ రాసుకున్నాను.
- అయితే 'సత్యభామ' కథ రాయడం పూర్తయ్యాక లీడ్‌రోల్‌లో ఎవరైనా హీరోయిన్ చేస్తే బావుంటుంది అనుకున్నాం. కాజల్ కథ వినగానే 'ఎస్' చెప్పారు. డూప్ లేకుండా యాక్షన్ సీక్వెన్స్‌లు చేశారు. సత్యభామ తన దగ్గరకు వచ్చిన ఒక కేసును పర్సనల్‌గా తీసుకుంటుంది. ఎమోషనల్ అవుతుంది. బాధితురాలికి న్యాయం చేసేందుకు ఎలాంటి పోరాటానికైనా సిద్ధమవుతుంది. పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా కాజల్ ప్రేక్షకులను ఆకట్టుకుంటారు. నవీన్ చంద్ర కీలకపాత్ర పోషిస్తున్నారు.

ఆ విల్లాలో ఏం జరిగింది?



విజయ్, శీతల్ భట్ జంటగా నటించిన 'విల్లా 369' చిత్రం షూటింగ్ పూర్తయింది. సురేశ్ ప్రభు దర్శకత్వం వహించారు. ' ఆ విల్లాలో ఏం జరిగింది అనే థ్రిల్లింగ్ కాన్సెప్ట్‌తో చిత్రాన్ని రూపొందించాం. సెన్సార్ పూర్తి చేసి, త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తాం. టీజర్, ట్రైలర్ కూడా రిలీజ్ చేస్తాం' అని ఆయన చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: మహావీర్, ఫొటోగ్రఫీ: ఎస్.కె.రఫీ, లైన్ ప్రొడ్యూసర్: శీలం ప్రణయ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: ఎం.లక్ష్మణ్‌బాబు, చిత్రం శ్రీను.

పిల్లలతో విహార యాత్ర



తమిళ దర్శకుడు విఘ్నేశ్ శివన్, హీరోయిన్ నయనతార దంపతులు తమ ఇద్దరు పిల్లలతో ప్రస్తుతం హాంకాంగ్ పర్యటనలో ఉన్నారు. డిస్నీల్యాండ్ రిసార్ట్‌లో దిగిన ఫొటోలను విఘ్నేశ్ షేర్ చేస్తూ 'పన్నెండేళ్ల క్రితం 'పోడా పోడీ' షూటింగ్ కోసం ఇక్కడికి వచ్చాను. అప్పుడు నా దగ్గర వెయ్యి రూపాయలే ఉన్నాయి. షూస్ కూడా లేవు. చెప్పులతో ఈ ప్రదేశమంతా తిరిగా. ఇప్పుడు నా భార్య, పిల్లలతో ఇక్కడికి రావడం చాలా ఆనందంగా ఉంది' అంటూ పేర్కొన్నారు.

హనీమూన్ సాంగ్



చైతన్యరావు, హెబ్బాపటేల్ జంటగా నటించిన రొమాంటిక్ ఎంటర్టైనర్ 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. సుహాసినీ, తనికెళ్ల భరణి కీలకపాత్రలు పోషిస్తున్నారు. బాల రాజశేఖరుని దర్శకత్వంలో కేకేఆర్, బాల రాజ్ నిర్మించారు. శనివారం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్' టైటిల్ సాంగ్‌ను దర్శకుడు కె. రాఘవేంద్రరావు చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'దర్శకుడు బాల మంచి టైటిల్‌తో ఈ చిత్రాన్ని నిర్మించారు. టైటిల్ సాంగ్ చాలా బావుంది. ఈ సినిమా మంచి విజయం అందుకోవాలి' అని ఆకాంక్షించారు. పాప్ సింగర్ స్ఫూర్తి జితేందర్ ఈ టైటిల్ పాటను స్వరపరిచి, ఆలపించారు. ఈ చిత్రానికి సంగీతం : కల్యాణి మాలిక్, సినిమాటోగ్రఫీ: శిష్టా వీఎంకే

విద్యుదాఘాతంతో జేఎల్ఎం మృతి

రాజాం: సంతకవిటి మండలంలోని సిరిపురానికి చెందిన జూనియర్ లైన్‌మెన్(జేఎల్ఎం) బూరాడమాధవరావు(26) శనివారం విద్యుత్‌ఘాతంలో మృతిచెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. సంతకవిటి మండలంలోని మోదుగులపేట గ్రామ సచివాలయంలో మాధవరావు విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం వీచిన గాలివానకు గ్రామంలో ఓ పంటపొలంలో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి.శనివారం అటుగా వెళ్లిన మాధవరావు తెగిపడిన వైర్లను సరిచేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయం తెలిసిన తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకున్నారు. మాధవరావు ఉద్యోగం చేసి సంపాదించిన జీతం డబ్బులతో కుటుంబమంతా జీవించేది. ఆయనమృతితో కుటుంబం వీధినపడిది. పెద్ద కుమారుడు పోలినాయుడు వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. కాగా విద్యుత్ అధికారులు చర్యలు తీసుకొని తమకు తగిన న్యాయం చేయాలని కుటుంబసభ్యులు కోరుతున్నారు.మాధవరావు మృతిచెందడంతో సిరిపురంలో విషాదఛాయలు అలముకున్నాయి గ్రామంలో అందరితో కలగొలుపుగా ఉండేవాడని, ఎవరికి విద్యుత్ సమస్యవచ్చినా తక్షణమే చర్యలు తీసకొని పరిష్కరించేవాడని గ్రామస్థులు చెబుతున్నారు.కాగా మృతదేహానికి రాజాం సామాజిక ఆసుపత్రిలో శవ పంచనామ నిర్వహించిన అనంతరం పోస్టుమర్టం నిర్వహించారు. ఈవిషయంపై పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

రాముడువలసలో గుర్తు తెలియని వ్యక్తి..

సాలూరు రూరల్ (బొబ్బిలి):బొబ్బిలి మండలంలోని రాముడువలస తోటపల్లి కుడి కాలువ గట్టు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి (45) మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ చెప్పారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ వీఆర్వో అలజంగి అప్పారావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

దుకాణంలో అగ్నిప్రమాదం

● కాలిబూడిదైన దుస్తులు, ఫర్నీచర్, పరికరాలు


మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సాలూరు: సాలూరు పట్టణంలోని పెద్దబజారులో రాబర్ట్ అలి వేలుకు చెందిన దుస్తుల దుకాణంలో శనివారం వేకువజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో అగ్ని ప్రమాదం చోటుచేసుకుది. దీంతో దుస్తులు, ఫర్నీచర్, ఎలక్ట్రికల్ పరికరాలు కాలిబూడిదయ్యాయి.సమాచారం మేరకు అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. కాగా సుమారు మూడు నుంచి ఐదు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని యాజమాని వాపోయాడు.

లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్

● బయటకు తీసిన కొత్తూరు పోలీసులు


నుజ్జునుజ్జయిన లారీ ముందు భాగం

భామిని: మండలంలోని కొరమ వద్ద శనివారం తెల్లవారుజామున ఒడిశా నుంచి విశాఖ వెళ్తున్న లారీ డైవర్షన్ వద్ద గేర్ బాక్స్ మొరాయించింది.అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న లారీఢీకొట్టింది. దీంతో క్యాబిన్‌లో చత్తీస్‌ఘడ్‌కు చెందిన డ్రైవర్, క్లీనర్ సాయిరాజ్, జహమ్మద్ క్యాబిన్‌లోనే ఇరుక్కుపోయారు. వారిద్దరూ కేకలు వేయడంతో శ్రీకాకుళం జిల్లాలోని కొత్తూరు పోలీస్‌స్టేషన్ సమాచారం స్థానికులు తెలియజేశారు. దీంతోపోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్యాబిన్‌లో ఉన్న ఇద్దరిని బయటకు తీసి 108లో శ్రీకాకుళంలోని ఆస్పత్రికి తరలించారు. దీంతో కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తూరు పోలీసులు తెలిపారు.

బొబ్బిలిలో యంత్రం సీజ్

సాలూరు రూరల్ (బొబ్బిలి): పట్టణ పరిధిలో ఫ్లై ఓవర్ మిలటరీ కాలనీ వద్ద అనుమతిలేకుండా చెరువు (బంద)ను చదును చేస్తున్న యంత్రం (ఎక్స్‌కవేటర్) శనివారం వీఆర్వో శ్రీనివాసరావు, లలిత సీజ్‌చేశారు. కాగా అక్రమంగా చెరువును ఆక్రమించడానికి చదును చేస్తున్న వారిపై క్రిమినల్ కేసు పెట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్న శనివారం డిమాండ్ చేశారు. పట్టణసమీపంలోని చెరువును ఆక్రమించడానికి చూడడం దారుణమన్నారు. రెవెన్యూఅధికారులు కబ్జాదారునిపై కఠినంగా వ్యవహరించాలని కోరారు.

లేఅవుట్లకు ప్లాన్ అప్రూవల్ తప్పనిసరి

● బొబ్బిలి మునిసిపల్ కమిషనర్ రామలక్ష్మి


అధికారులతో మాట్లాడుతున్న రామలక్ష్మి

సాలూరు రూరల్ (బొబ్బిలి): బొబ్బిలి పట్టణ పరిధిలో వేస్తున్న అన్ని లేఅవుట్లకు ప్లాన్ అప్రూవల్ తప్పనిసరిగా ఉండాలని మునిసిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి తెలిపారు. శనివారం మునిసిపల్ సిబ్బందితో కలిసి పట్టణంలోని గొల్లవీధి, అప్పయ్యపేట రోడ్లు ఉన్న లేఅవుట్లు, అపార్ట్‌మెంట్లను పరిశీలించారు. ఆయా నిర్మాణాల ప్లాన్ల గురించి టౌన్ ప్లానింగ్ అధికారులను అడిగితెలుసుకున్నారు. ఎక్కడ ప్లాన్‌లేకుండా నిర్మాణాలు జరగకుండా ప్లానింగ్ అధికారులు శ్రద్ధ చూపాలనికోరారు. అనంతరం కుమ్మరివీధి పరిధిలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు.

వృద్ధాశ్రమానికి రూ.50 వేలు విరాళం

రాజాం:కొండంపేట గ్రామ సమీపంలో పెదపూడి శ్రీనివాస్, విజయశాంతి దంపతుల ఆధ్వర్యంలో నిర్మించిన అనాథ, వృద్ధాశ్రమం నూతన భవనాన్ని శనివారం ప్రారంభించారు. 50 మందివరకు వృద్ధులకు సరిపడే ఆధునిక వసతులతో ఉన్న గదులను మోణింగి ఆదినారాయణ, ప్రమీల దంపతులు ప్రారంభించారు. కార్యక్రమంలో తలే రాజేష్, పాలవలస శ్రీనివాసరావు, మక్క అప్పలనాయుడు, పెంకి చైతన్యకుమార్, గట్టి పాపారావు, బీవీ అచ్యుత కుమార్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్వప్న హైందవి తదితరులు పాల్గొన్నారు. అనాథ వృద్ధాశ్రమానికి ప్రైవేటు పాఠశాలల జిల్లా సంఘ అధ్యక్షుడు గట్టి పాపారావు దంపతులు రూ.50,116 విరాళంగా అందజేశారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

రామభద్రపురం: వడదెబ్బకు గురికాకుండా ప్రజలు అన్ని జాగ్రత్తలు తీసుకొని అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఏఎల్‌జీ శిరీష సూచించారు. రొంపల్లిలో శనివారం వైద్య శిబిరం నిర్వహించి స్థానికులను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఎండలు ఎక్కువగా ఉండడంతో ప్రజలు అవసరమైతే తప్ప బయటకు వెళ్లరాదని చెప్పారు. అనంతరం షుగర్, ఇతర వ్యాధులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ నడిమింటి వాసు, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


కొత్తవలస: మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


జామిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

మలేరియాపై చైతన్యం కల్పించాలి

●డీఎంహెచ్‌వో భాస్కరరావు ● జిల్లాలో మలేరియా వ్యతిరేక మాసం ర్యాలీలు

జామి:మలేరియా నివారణపై వైద్యసిబ్బంది ప్రజలను చైతన్యవంతం చేయాలని డీఎంహెచ్‌వో భాస్కరరావు కోరారు. శనివారం జామిలో పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో మలేరియా వ్యతిరేక మాసం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాసహకారంతోనే మలేరియలేని సమాజం సాధ్యమని, మలేరియాను చిన్నపాటి జాగ్రత్తలతోనివారించవ్చని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ఎడ్యుకేటర్ అనీల్ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

● **కొత్తవలస:** పరిసరాల పరిశుభ్రతతోనే మలేరియాను నిర్మూలించవచ్చని వియ్యంపేట వైద్యాధికారి గోపాలకృష్ణ సూచించారు. శనివారం వియ్యంపేటలో మలేరియా వ్యతిరేక మాసంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వల్ల దోమల వ్యాప్తిని నిర్మూలించే అవకాశాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది నరసింహారావు జగదాంబ, పద్మావతి, ఈశ్వరరావు, ఆశజ్యోతి, సత్యారావు తది తరులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌లో ఆఖరు వరకూ ఉండాలి

●శృంగవరపుకోట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి


లక్కవరపుకోటలో ఏజెంట్లకు శిక్షణ ఇస్తున్న టీడీపీ నాయకులు

లక్కవరపుకోట:కౌంటింగ్ఏజెంట్లుగా వెళ్లేవారంతా తప్పనిసరిగా జాగ్రత్త వహించి, ఆఖరు వరకూ ఉండాలని శృంగవరపుకోట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి కోరారు. శనివారం లక్కవరపుకోటలో ఈనెల నాలుగోతేదీన జరిగే కోళ్ల లలితకుమారి, ఎంపీభరత్ తరఫున సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ఏజెంట్లుగా వెళ్లేవారికి పార్టీ సీనియర్‌నాయకుడు గొంప దుర్గాఉమేష్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా లలితకుమారి మాట్లాడుతూ ఏజెంట్లుగా వెళ్లేవారంతా తప్పనిసరిగా జాగ్రత్త వహించాలని, ఎవరైనా కవ్వింపు చర్యలకు పాల్పడినా రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేయాలని కోరారు. కౌంటింగ్ ప్రక్రియలో ఎటువంటి సందేహం వచ్చినా ఆర్వోను సంప్రదించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓపికతో సంయమనం పాటించాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఏజెంట్లకు ఆదివారం శిక్షణ జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

● పీహెచ్‌సీలో ప్రసవాలపై దృష్టి సారించాలి

● వైద్య సిబ్బందికి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి హెచ్చరిక


బీసీజీ టీకాలు తీసుకున్న వారితో మాట్లాడుతున్న భాస్కరరావు

కొత్తవలస: విధి నిర్వహణలో అలసత్వం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికా ఎస్.భాస్కరరావు హెచ్చరించారు. శనివారం కొత్తవలస పీహెచ్‌సీ పరిధిలోని చింతలదిమ్మ గ్రామంలో నిర్వహిస్తున్న బీసీజీ టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా టాకాలు తీసుకున్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. బీసీజీ టీకాలు తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. క్షయవ్యాధికి గురికాకుండా ఉండవచ్చని తెలిపారు.వయోజనులంతా బీసీజీ టాకాలను తప్పనిసరిగా తీసుకోవాలని, దీని వల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని చెప్పారు. అనంతరం కొత్తవలస పీహెచ్‌సీని పరిశీలించారు. ప్రతి పీహెచ్‌సీలోనూ ప్రసవాలు తప్పనిసరిగా జరిగేవిధంగా సిబ్బంది దృష్టిసారించాలని కోరారు. పీహెచ్‌సీలకు విధించిన లక్ష్యాలను పూర్తిచేయాలని కోరారు. ప్రస్తుతం వయోజనులకు నిర్వహిస్తున్న బీసీజీ టీకాలను ప్రతి పీహెచ్‌సీలో శతశాతం పూర్తిచేయాలని,ఈ విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సీతల్‌వర్మ, సిబ్బంది వెంకటేష్, చంద్రశేఖర్‌రాజు, కృపా, అనిల్‌ప్రేమ్‌కుమార్, రమణమ్మ, బేబిరాణి పాల్గొన్నారు.

పారితోషికం తక్షణమే చెల్లించండి

● చీపురుపల్లిలో ఎన్నికల రూట్ అధికారుల నిరసన


నిరసన తెలియజేస్తున్న ఎన్నికల రూట్ అధికారులు

చీపురుపల్లి: తక్షణమే పారితోషికం చెల్లించాలని ఎన్నికల రూట్ కోరారు. ఈమేరకు శనివారం చీపురుపల్లి తహసీల్దారు కార్యాలయం ఎదుట రూట్ ఆఫీసర్లుగా విధులు నిర్వహించిన వెలుగు అధికారులు నిరసనతెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో తమ సేవలుఉపయోగించుకొని పారితోషికం చెల్లించకుండా కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారనివాపోయారు. ఎన్నికల సమయంలో తామంతా 14 రోజులపాటు విధులు నిర్వహించామని తెలిపారు. రెగ్యులర్‌గా 33మంది, రిజర్వ్‌విధుల్లో ఇద్దరు పనిచేశామని చెప్పారు.ఇంతవరకూ తమకు ఒక్కపైసా కూడా చెల్లించలేదని తెలిపారు. తమకు రావాల్సిన పారితోషికం గురించి ఎన్నిసార్లు అడిగినా, ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ విషయంపై తహసీల్దారు, ఆర్వోలు దాటవేస్తున్నారని ఆరోపించారు. జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న కలెక్టర్ స్పందించాలని కోరారు.

దోమల నివారణకు చర్యలు: డీఎంవో


పెదఖేర్జిలలో స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జగన్మోహనరావు

కొమరాడ:దోమల నివారణకు ఏసీఎం ద్రావణాన్ని ఇంటింటికీ పిచికారీ చేయిస్తున్నామని మన్యం జిల్లా మలేరియా అధికారి టి.జగన్మోహనరావు తెలిపారు. కొమరాడ మండలంలోని పెదఖేర్జిలలో చేపడుతున్న మొదటి విడత స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని ఆయన శనివారం పర్యవేక్షించారు. ఇంటింటికీ స్ప్రేయింగ్ పూర్తి చేసినట్లు సూచించే మార్కింగ్‌ను తప్పనిసరిగా వేయాలన్నారు. అలాగే స్థానిక గిరిజన సంక్షేమ వసతి గృహంలో స్ప్రేయింగ్‌ను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 43 మలేరియా ప్రభావిత గ్రామాల్లో మొదటి విడత స్ప్రేయింగ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. శనివారం చేపట్టిన ఐదుగ్రామాలతో కలిపి ఇప్పటికి 38 గ్రామాల్లో పూర్తి చేశామని తెలిపారు. వీటితో పాటు అన్నిగ్రామాల్లో ఫీవర్ సర్వే, ఫోకల్ స్ప్రే, ఏఎల్‌వో, డ్రైడే కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతూ సంబంధిత శాఖల సమన్వయంతో పనిచేసి మలేరియా, డెంగ్యూ, తదితర జ్వరాల నియంత్రణకు సిబ్బంది కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ అరుణ్‌కుమార్, సబ్ యూనిట్ అధికారి ధనుంజయరావు, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, పీహెచ్ఎన్ విజయకుమారి, ఈవో సత్తిబాబు, వైద్య సిబ్బంది మంగమ్మ, రమేష్ ఉన్నారు.

చేనేత కార్మికులకు కలిశెట్టి అభినందన


చేనేత వస్త్రాన్ని పరిశీలిస్తున్న కలిశెట్టి

లావేరు: ప్రధానిగా హ్యాట్రిక్ సాధించనున్న మోదీకి అభినందనలు తెలిపే చేనేత వస్త్రాల నేత పనులు సకాలంలో పూర్తి చేసిన నేతన్నలను విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్డీఏ కూటమి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు అభినందించారు. శనివారం లావేరులోని చేనేత కార్మికులు బాసిన నాగేశ్వరరావు, లక్ష్మి దంపతులను అప్పలనాయుడు స్వయంగా కలుసుకుని వస్త్రాల పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనుకున్న సమయం కంటే ముందుగానే పనులు పూర్తి చేయగలిగామని చేనేత కార్మికులు తెలిపారు. ప్రధాని మోదీ చిత్ర పటాన్ని డిజైన్ చేసి చేనేత వస్త్రాలను నేసిన నాగేశ్వరరావు, లక్ష్మి దంపతులను కలిశెట్టి అభినందించారు. అలాగే ఎన్డీఏ కూటమిలో విజయం సా ధించనున్న నారా చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేష్‌లకు అభినందనలు తెలిపే చేనేత వస్త్రాలను కూడా త్వరలో పూర్తి చేయాలని చేనేత కార్మికులైన నాగేశ్వరరావు, లక్ష్మి దంపతులను ఆయన కోరారు.

12వ తేదీకి పాఠశాలలకు కిట్లు

● మన్యం జిల్లా డీఈవో పగడాలమ్మ


పుస్తకాల స్టాక్‌ను పరిశీలిస్తున్న పగడాలమ్మ

కురుపాం: మన్యం జిల్లాలోని అన్ని పాఠశాలలక ఈనెల 12లోగా కిట్లు అందజేస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి పగడాలమ్మ తెలపారు. శనివారం కురుపాం ఆదర్శ పాఠశాలలో విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో విద్యార్థులకు పంపిణీ చేయనున్న విద్యా కానుక స్టాక్ పాయింట్ ను పరిశీలించారు. ఏయే తరగతుల పుస్తకాలు వచ్చాయో సీఆర్పీలను అడిగి తెలుసుకున్నారు. ఐదో తేదీకి అన్ని తరగుతుల పుస్తకాలు మండల పాయింట్లకు చేరుకుంటాయని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ కృష్ణమూర్తి, సీఆర్పీలు పాల్గొన్నారు.

హైస్కూల్ ప్లస్ తరగతులు


బొండపల్లిలో హైస్కూల్ ప్లస్ తరగతుల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎంఈవో శోభారాణి

బొండపల్లి: బొండపల్లి ఉన్నతపాఠశాలను హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేసి ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులను ఇంటర్ ఎంపీసీ, సీఈసీ బ్రాంచిల్లో చేర్పించుకున్నట్లు ఎంఈవోలు కె.శోభారాణి, అల్లు వెంకటరమణ తెలిపారు. శనివారం బొండపల్లి పాఠశాలలో ఇంటర్ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీ సీలో 14 మంది, సీఈసీలో ఐదుగురిని చేర్చుకున్నట్లు తెలిపారు. జిల్లాలో ఆసక్తి కలిగిన ఎంఎస్సీ బీఈడీ చేసిన ఉపాధ్యాయులను నియమించనున్నట్లు చెప్పారు. మండలంలో ఎనిమిది ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణలైన విద్యార్థులు బొండపల్లి ప్లస్ పాఠశాలలో చేరాలని కోరారు.

● **రామభద్రపురం:**రామభద్రపురం జడ్పీఉన్నత పాఠశాల హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ కావడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభించినట్లు జిల్లా ఉపవిద్యాశాఖాధికారి కె.మోహనరావు తెలిపారు. ప్రస్తుత ఎంపీసీ,సీఈసీ సెక్షన్లను మాత్రమే ప్రారంభిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు కామేశ్వరరావు చెప్పారు. రామభద్రపురం మండల విద్యాశాఖాధికారులు తిరుమల ప్రసాద్,పెంటయ్య మాట్లాడుతూ విద్యార్థులకు మోటివేషన్‌చేసి లక్ష్యం మేరకు ప్రవేశాలు కల్పించాలని సూచించారు.

●**శృంగవరపుకోట రూరల్:**ధర్మవరం బాలికల జూనియర్ కళాశాలలో శనివారం నుంచి తరగతులు ప్రారంభించినట్లు ఉన్నత పాఠశాల హెచ్ఎం ఉమమహేశ్వరరావు తెలిపారు. ఇంటర్ బైపీసీ, ఎంపీసీ తరగతులు మొదలయ్యాయని చెప్పారు.

డ్రాపౌట్లు లేకుండా చర్యలు

● కార్మిక శాఖ ఇన్‌స్పెక్టర్ జోషిల

వేపాడ: గ్రామస్థాయిలో బాలకార్మికులు, పాఠశాలల్లో డ్రాపౌట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని కార్మిక శాఖ ఇన్‌స్పెక్టర్ టి.జోషిల కోరారు. శనివారం మండలంలోని పలు ప్రాంతాల్లో మండల విద్యా శాఖాధికారి బాలభాస్కరరావు ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో బాల కార్మికులకోసం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో చదువుకు దూరమయ్యే చిన్నారులు, బాల కార్మికులు లేకుండా చేసే బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ఈ విషయం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.


బాలకార్మికుల కోసం సర్వేచేస్తున్న సిబ్బంది

కార్మికులతో కొలిక్కిరాని చర్చలు

●జాజ్‌పూర్‌లో పని కల్పిస్తాం: జిందాల్ కర్మాగార యాజమాన్య ప్రతినిధి గోపాలకృష్ణ ●కొత్తవలసలో కార్మిక సంఘాలతో భేటీ


చర్చలలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు, యాజమాన్య ప్రతినిధులు

కొత్తవలస: కార్మికులకు ఒడిశాలోని జాజ్‌పూర్‌లో గల తమ యూనిట్‌కు పంపించి పని కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని జిందాల్ కర్మాగార యాజమాన్య ప్రతినిధి గోపాలకృష్ణ తెలిపారు. శనివారం కొత్తవలస పోలీసు స్టేషన్‌లో కార్మిక సంఘాల నాయకులు, యాజమాన్యంతో సీఐ వి.చంద్రశేఖరరావు సమక్షంలో చర్చలు కొలిక్కిరాలేదు. కార్మికులకు లేఆఫ్ ఇవ్వాలని కార్మిక సంఘాల నాయకులు మరోసారి డిమాండ్‌చేశారు. ప్రతి రెండు మూడు సంవత్సరాల కొకసారి లాకౌట్ విధించడం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఇప్పటికే 40 ఏళ్లుగా కర్మాగారంలో పనిచేస్తున్నామని, ఇన్ని సంవత్సరాలు పనిచేస్తున్నా తమకు ఇంకా కాంట్రాక్టు కార్మికులుగానే పరిగణిస్తున్నారని చెప్పారు. కాంట్రాక్టు కార్మికులకు లే ఆఫ్ ఇవ్వలేమని, పని కావాలంటే జాజ్‌పూర్‌లో ఉన్న తమ సంస్థలకు చెందిన యూనిట్‌కు పంపించడానికి సిద్ధంగా ఉన్నామనియాజమాన్య ప్రతినిధి తెలిపారు. సీఐ చంద్రశేఖర్ సమస్యను ఏదో విధంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని యాజమాన్యానికి సూచించారు. విశాఖలోని జేసీఎల్ వద్ద చర్చలు ఉన్నాయని, అక్కడ చర్చల అనంతరం చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. ఈ చర్చల్లో వైసీపీ, సీఐటీయూ, టీఎన్‌టీయూసీ కార్మి సంఘాల తరఫున నెక్కల నాయుడు బాబు, పిల్లా అప్పలరాజు, గాడి అప్పారావు, బొట్టారాము, వామాలు, కోన దేముడు పాల్గొన్నారు.

ఎస్.కోటలో బ్యాడ్మింటన్ పోటీలు

శృంగవరపుకోట: ఎస్.కోటలో నిర్వహిస్తున్న వేసవి బ్యాడ్మింటన్ క్రీడా శిక్షణ శిబిరంలోని విద్యార్థులకు శనివారం పోటీలను నిర్వహించారు. చీఫ్ కోచ్ పొట్నూరు శ్రీరాములు నెల రోజులుగా శిక్షణఇస్తున్నారు. మినీ జూనియర్, సబ్ జూనియర్, సీనియర్, సూపర్ సీనియర్ విభాగాలుగా పోటీలు నిర్వహించారు. కోచ్‌లు బి.హారిక, పి.మౌనిక పాల్గొన్నారు.

బెల్ట్ షాపులకే మేలు

● ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముప్పల శ్రీనివాసరావు

సాలూరు రూరల్ (బొబ్బిలి): ఎన్నికల ఫలితాలు వెలువడనున్న సందర్భంగా ఈ నెల 3 నుంచి 5 వరకు మద్యం షాపుల మూసివేత వల్ల బెల్ట్‌షాపులకు పండుగ వచ్చినట్టేనని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట అధికార ప్రతినిధి ముప్పల శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. ఆయన బొబ్బిలిలో శనివారం విలేకరులతో మాట్లాడారు. షాపుల మూసివేత ప్రకటన వల్ల బెల్ట్‌షాపు నిర్వాహకులు మందును ముందుగానే నిల్వ చేస్తారన్నారు. మద్యం షాపులను మూసివేసిన సమయంలో బెల్ట్‌షాపుల వారు బాటిల్‌కు రూ.50 అధికంగా వసూలు చేస్తున్నారని తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయాలు జరగకుండా ఎస్ఈబీ, పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేయాలని కోరారు.

తాగునీటి సమస్యపై దృష్టిపెట్టాలి

రాజాం:గ్రామాల్లోతాగునీటి సమస్యపై ప్రత్యేకదృష్టి పెట్టాలని ఎంపీపీ లావేటి సులోచన ఆదేశించారు. శనివారం రాజాం మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సమావేశంజరిగింది. ఈసందర్భంగా మాట్లాడుతూ బోర్లు పని చేయడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చర్యలు తీసుకొనిమరమ్మతులు చేయించాలని కోరారు. రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు, పురుగులుమందులు అందించేలావ్యవసాయశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.శ్రీనివాసరావు. వైస్ ఎంపీపీ యాలాల సునీత, రాజగోపాలనాయుడు, వెంకట మన్మథరావు పాల్గొన్నారు.

ఒడిశాలో వడదెబ్బతో పెద్దశిర్లాం వాసి మృతి


అప్పల నాయుడు (ఫైల్)

రేగిడి: ఇనుప ముక్కల వ్యాపారానికి ఒడిశా వెళ్లినా రేగిడి మండలంలోని పెద్దశిర్లాం యువకుడు వడదెబ్బకు గురై మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు... పెద్దశిర్లాం గ్రామానికి చెందిన సంచాన అప్పలనాయుడు (35) ఇనుప ముక్కల (స్క్రాప్) వ్యాపారానికి గ్రామానికి చెందిన 13 మంది యువకులతో కలిసి ఇటీవల ఒడిశాలోని మల్కాజ్‌గిరి వెళ్లాడు. శుక్రవారం మధ్యాహ్నం మల్కాజిగిరి నుంచి తన ద్విచక్రవాహనంపై సమీపంలోని గూడలకు వెళ్లే క్రమంలో ఎండలో అస్వస్థతకు గురయ్యాడు. అనంతరం కుప్పకూలి చనిపోయినట్లు కుటుంబీకులకు సమాచారం అందింది. మృతదేహాన్ని మల్కా జిగిరి ఆసుపత్రికి తరలించారు. ఆయనకు తల్లిదండ్రులతో పాటు భార్య రాధ, ఇద్దరు కుమార్తెలు హారిక, పూజిత ఉన్నారు. వీరిది రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబం. తమ ఇంటికి ఆధారమైన వ్యక్తి చనిపోవటంతో భార్యాపిల్లలు, తల్లి దండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనపై తమకు సమాచారం అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

సబ్‌జైలును పరిశుభ్రంగా ఉంచాలి

● శ్రీకాకుళం జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

పాలకొండ: స్థానిక సబ్‌జైలు పరిసరాలు, సెల్స్ పరిశుభ్రంగా ఉంచుకోవా లని శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా సూ చించారు. పాలకొండ సబ్‌జైలును పాలకొండ సివిల్ న్యాయాధికారి విజయరాజ్ కుమార్‌తో కలిసి ఆయన శనివారం ఆకస్మికంగా సందర్శించారు. జైలులో ఖైదీలు ఉండే సెల్స్ స్నానపు గదులు, మలమూత్ర విసర్జన గదులను పరిశీలించారు. మొత్తం జైల్లో ఎన్ని గదులు ఉన్నాయని జైలు సూపరింటెండెంట్ జోగులను అడిగి తెలుసు కున్నారు. అనంతరం జైలులో ఉన్నా రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. ఏ నేరం మీద వచ్చారని, జైల్లో సదుపాయాలపై అడిగి తెలుసు కున్నారు. రిమాండ్ ఖైదీల కు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించాలని ఆయన ఆదేశించారు. వంటరూం, స్టాక్‌రూంలను తనిఖీ చేశారు. జైల్లో పండిస్తున్న కూరగాయలపై అడిగి తెలుసు కున్నారు. జైలు పరిసరాలు కలియతిరిగి, పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు. రిమాండ్ ఖైదీల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాలకొండ ఎస్‌ఐ ఎస్.ప్రశాంత్‌కుమార్, జైలు హెడ్‌వార్డర్స్ పి.చంద్రరావు, బి.విజయ్‌కుమార్‌లతో పాటు న్యాయవాదులు బి.రామ్మోహన్‌రావు, పి.మునిస్వామి, కె.రవి, ఎం.వెంకటేశ్వరరావు, శామ్యూల్, జైలు సిబ్బంది పి.మధు, నాగరాజు, నాయు డులతో పాటు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

కాలుష్య నివారణతో ఆరోగ్యం

భామిని: కాలుష్యాన్ని నివారించి.. పర్యావరణాన్ని పరిరక్షిస్తే మానవజాతి సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటుందని కొత్తూరు జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.రాణి పేర్కొన్నారు. శనివారం బిల్లుమడ జీడి ఫ్యాక్టరీ ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఫ్యాక్టరీ వల్ల వ్యర్థాలతో కలిగే నష్టాల పై వివరించారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. న్యాయపరంగా ఏ సాయం కావాలన్నా అందిస్తామని చెప్పారు. బాలకార్మిక చట్టంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా పలువురు న్యాయవాదులు, అధికారులు చట్టాలపై వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అప్పారావు, బత్తిలి ఎస్‌ఐ సీహెచ్ ప్రసాద్, న్యాయవాదులు రవికిరణ్, ధర్మారావు, జి.ఫల్గుణరావు, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం

● దెబ్బతిన్న అరటి, గులాబీ ● రోడ్లపై కూలిన చెట్లు

గరుగుబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం రాత్రి వీచిన ఈదురుగాలులకు అరటి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. రావివలస, లఖనాపురం, సంతోషపురం, ఖడ్గవలస, పిట్టలమెట్ట, నందివాని వలస, గిజబ, తోటపల్లిలోని సుమారు 200 ఎకరాల్లో అరటి తోటలు నేలవాలాయి. ఆయా



రావివలసలో నేలకొరిగిన అరటి

ప్రాంతాల్లో 50 ఎకరాల్లో గులాబీ తోటలు కూడా దెబ్బతిన్నాయి. అధికారులు పరిశీలించి పరిహారం అందించేలా చర్యలు తీసుకో వాలని రైతులు కోరుతున్నా రు. ఇదిలా ఉండగా గిజబ సమీపంలో రహదారిపై రెండు చెట్లు నేలకూలాయి. దీంతో జియ్యమ్మవలస, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, ఒడిశా రాష్ట్రం గుణుపూర్ వైపు వెళ్లే రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానికులు స్పందించి వాటిని తొలగించడంతో శుక్రవారరం రాత్రి పది గంటల తర్వాత ట్రాఫిక్ క్లియర్ అయ్యింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

ట్రాక్టర్ బోల్తా.. యువకుడి మృతి

రాయగడ: ట్రాక్టర్ బోల్తాపడి ఓ యువకుడు మృతిచెందిన ఘటన కళ్యాణసింగుపూర్ సమితి కొండోకత్తిపాడు దంతలింగ గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి కళ్యాణసింగుపూర్ పోలీసు స్టేషన్ అధికారి నీలకంఠ బెహేరా శనివారం తెలిపిన



పొలంలో బోల్తా పడిన ట్రాక్టర్

వివరాలు ఇలా ఉన్నాయి. దంతలింగ గ్రామానికి చెందిన జగిలి మినియక కుమారుడు రామచంద్ర మినియక శుక్రవారం పొలం దున్నడానికి ట్రాక్టరు తీసుకుని వెళ్లాడు. పొలం పనులు ముగించుకుని తిరిగి వస్తున్న సమయంలో దంతలింగ-కొత్తగుడ గ్రామ రహదారి మధ్యలో ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు

ఒడిశా

దిగువకు పడిపోయింది. ఈ ప్రమాదంలో రామచంద్రపై ఇంజిన్ పడిపోయింది. దీంతో ఆయన ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం రామచంద్ర మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగు పాటుకు ఎనిమిది పశువుల మృతి

రాయగడ: పిడుగుపాటుకు ఏడు ఎద్దులు, ఒక ఆవు మృతిచెందాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కల్యాణి సింగుపూర్ సమితిలో శుక్రవారం సాయంత్రం తీవ్రమైన గాలులు, పిడుగులతో కూడిన వర్షం పడింది.



పిడుగుపాటుకు మృతిచెందిన ఎద్దులు

ఈ ప్రభావానికి పొలమ పంచాయతీ అగుగుడ రైతులు గోప హిమిరిక, సీతయ్ హిమిరిక, రామసింగ్‌లకు చెందిన ఏడు ఎద్దులు పిడుగు పాటుకు మృతిచెం దాయి. సికరాపాయి గ్రామ రైతుకు చెందిన ఒక ఆవు పిడుగుపడి మృతి చెందింది. తమ జీవనాధారం కోల్పోయామని రైతులు వాపోతున్నారు. తమను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని బాధితులు అధికారులకు మొరపెట్టుకుం టున్నారు. అలాగే సునాఖండి పంచాయతీ పరిధిలోని పలువురి ఇళ్ల పైకప్పులు ఎగిరిపోవడంతో పాటు ఇంట్లో ఉన్న నిత్యావసర వస్తువులు బియ్యం, చోలు బస్తాలు, సిమెంటు బస్తాలు తడిచిపోయాయి.

పర్యావరణంపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు

రాయగడ: జిల్లా లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం ఇంఫా పరిశ్రమ ప్రాంగణంలో పర్యావరణంపై న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ వ్యర్థ పదార్థాలను ఇష్టారీతిన పారవేయకుండా ఎలా ఉపయోగించాలో వివరించారు. పరిశ్రమ నుంచి విడుదలవుతున్న బూడిద వంటి వ్యర్థాలతో ఇటుకలు తయారవుతున్న విషయాన్ని తెలిపారు. పరిశ్రమ వ్యర్థాలను ఎలా ఉపయోగించాలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్యానల్ న్యాయవాదులు లునామతి పండా, సీతారాం పండా, పరిశ్రమ జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్, పీఆర్వో శక్తిప్రసాద్ పాణిగ్రహి, సీనియర్ క్వాలిటీ కంట్రోలర్ ప్రశాంత్‌కుమార్ నాయక్, పరిశ్రమ ఉద్యోగులు పాల్గొన్నారు.

రోగులకు పాలు పంపిణీ

రాయగడ: ప్రపంచ పాల దినోత్సవం సందర్భంగా స్థానిక మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు ఆసుపత్రిలోని రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. గర్భిణులకు ప్రత్యేక పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు కొరాడ రజిత, ఉపాధ్యక్షురాలు శ్రమితాపాఢి, కార్యదర్శి కె.భారతి, కోశాధికారి బి.లక్ష్మి, సుజాత పాలో, శోభారాణి విజయలక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ జయంతి



కురుపాం: అభయాంజనేయ స్వామి ఆలయంలో..

● జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు
● బారులు తీరిన భక్తులు
● పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు, శోభాయాత్రలు

హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆంజనేయుని ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. అర్చకులు భక్తులతో పూజలు జరిపించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు చర్యలు చేపట్టారు. ప్రసాద వితరణ చేశారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు, శోభాయాత్రలు నిర్వహించారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



సాలూరు: పట్టణంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి



వీరఘట్టం: బొడ్లపాడులో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి జయకృష్ణ



పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



గరుగుబిల్లి: నాగూరులో పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో..



మక్కువ: కోన గ్రామంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రశాంత కౌంటింగ్‌కు సహకరించాలి

● పాలకొండ డీఎస్పీ కృష్ణారావు

గరుగుబిల్లి: ఉల్లిభద్ర ఉద్యాన కళాశాల ఆవరణలో ఈనెల 4న నిర్వహించనున్న ఓట్లు లెక్కింపునకు అసౌకర్యం కల్పించకుండా సహకరించాలని పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు సూచించారు. శనివారం రాత్రి ఉల్లిభద్రతో పాటు పరిసర గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళి మేరకు లెక్కింపు ప్రాంతంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని చెప్పారు. మన్యం జిల్లాకు సంబంధించి పాలకొండ, పార్వతీపురం, సాలూరు, కురుపాం నియోజకవర్గాలకు చెందిన లెక్కింపు జరగనున్న దృష్ట్యా ఇతర ప్రాంతాలకు చెందిన వారికి ఆశ్రయం కల్పించరాదన్నారు. గ్రామాల్లోని ప్రజలు తప్ప వేరే వ్యక్తులు ఉండరాదన్నారు. సమీప బంధువులను గ్రామంలోకి రానివ్వకూడదని సూచించారు. గ్రామాల్లో జన సమీకరణకు అవకాశం ఉన్న సమావేశాలు, తదితర కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. ఈ నెల 5వ తేదీ వరకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, ఇప్పటికే ముందస్తు నోటీసులు జారీ చేశామని తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు నెలకొనకుండా ఉండేందుకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. అల్లర్లకు పాల్పడితే చట్టపరమైన



గరుగుబిల్లి: ఉల్లిభద్రలో అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ కృష్ణారావు

చర్యలు తప్పవని, నిబంధనలు ధిక్కరిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ వై.అమ్మన్నరావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

పది గ్రామాల్లో పోలీసు పికెటింగ్

● పార్వతీపురం రూరల్ సీఐ రవికుమార్

సీతానగరం: పార్వతీపురం సర్కిల్ పరిధిలోని 10 గ్రామాల్లో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేసినట్టు పార్వతీపురం రూరల్ సీఐ రవికుమార్ తెలిపారు. ఎగ్జిట్ పోల్స్ వెలువడిన తర్వాత మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో ఆయన శనివారం సం దర్శించారు. ఈసందర్భంగా ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతూ శనివా రం సాయంత్రం నుంచి ఈ నెల 5వ తేదీ వరకు పికెటింగ్ కొనసాగిస్తున్నట్టు తెలిపారు. సీతానగరం మండలంలోని పెదభోగిల, వెన్నెల బుచ్చమ్మపేట, బలిజి పేట మండలంలోని అజ్జాడ, చిలకల పలగర పార్వతీపురం మండలంలోని ఎంఆర్ నగర్, బందలుప్పి, కొమరాడ మండలంలోని వన్నాం, దలాయిపేట, మాదలింగి గ్రామాల్లో పికెటింగ్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇప్పటికే పెద్దఎత్తున బైండోవర్ కేసులు నమోదు చేశామని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నా వారిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫలితాలు వెలువడిన తర్వాత గ్రామాల్లో ఎటువంటి ఆనందోత్సవాలు నిర్వహించినా, పటాసులు కాల్చినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ శాఖ జేడీ రాబర్ట్‌పాల్

పార్వతీపురం రూరల్: మండలంలోని డోకిశీల తదితర గ్రామాల పరిధిలో ఉన్న రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఖరీఫ్‌కు సంబంధించిన విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయశాఖ జేడీ రాబర్ట్‌పాల్ శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రణాళిక ప్రకారం వ్యవసాయం చేస్తూ మంచి దిగుబడి సాధించాలని కోరారు. ఏమైనా సందేహాలుం టే తమ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. విత్తనాల కోసం ఎటువంటి ఇబ్బందులు లేవని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

బాబాకు లక్ష పుష్పార్చన

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవంలో భాగంగా శనివారం లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక భజన బృందం ఆధ్వర్యంలో సాయి నామ సంకీర్తనను ఆలపించారు. ఆదివారం సుదర్శన హోమాలు, సోమవారం మహా రుద్రాభిషేకం నిర్వహిస్తామని చెప్పారు.



సాయినాథునికి పుష్పార్చన చేస్తున్న దృశ్యం

మండిన ఎండ

సాలూరు రూరల్: సాలూరు అర్బన్, రూరల్‌లో శనివారం ఎండ మండిపోయింది. సాలూరు ఏజెన్సీలో 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. సాయంత్రం ఐదున్నర గంటల తర్వాత చల్లని గాలి వీయడంతో కాస్త ఉపశమనం కలిగింది.

బోసిపోయిన తోణాం సంత

సాలూరు ఏజెన్సీలో ఎండల తీవ్రత కారణంగా శనివారం తోణాం సంత బోసిపోయింది. గిరిజనులు తమ అటవీ ఉత్పత్తులను ఇక్కడ విక్రయిస్తూ.. తమకు కావలసిన నిత్యావసర సరుకులు కొనుగోలు చేస్తుంటారు. ఎండలు మండుతుండడంతో సంతకు వచ్చిన వారి సంఖ్య తగ్గింది.



తోణాం సంతలో కొనుగోలుదారులు తక్కువగా ఉన్న దృశ్యం

పక్కాగా కౌంటింగ్: ఆర్వో

పార్వతీపురం, (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పక్కాగా ఓట్ల లెక్కింపు చేపట్టలని, ఈ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలని సాలూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, పార్వతీపురం ఐటీడీఏ పీవో విష్ణుచరణ్ సూచించారు. శనివారం ఐటీడీఏలోని గిరిమిత్ర సమా వేశ మందిరంలో కౌంటింగ్ సిబ్బందితో సమీక్షించారు. ఓట్ల లెక్కింపులో ఏ సమస్య వచ్చినా.. వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. నిరంతరం అప్ర మత్తంగా ఉండాలని తెలిపారు. ఎటువంటి పొరపాటు జరగకుండా చూడా లన్నారు. సాలూరు నియోజకవర్గ కౌంటింగ్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

ధరల పట్టికలు ప్రదర్శించాలి

వీరఘట్టం: స్థానిక రైతు భరోసా కేంద్రం లో ఎరువులు, పురుగు మందు ల షాపుల యజమానులతో ఏడీఏ రత్న కుమారి శనివా రం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి షాపు వద్ద ధరల పట్టిక, స్టాక్‌బోర్డులను ప్రదర్శించాలని సూచించారు. విత్తనాలు, ఎరువు లు కొనుగోలు చేసే రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. అధీకృత డీలర్ల వద్ద మా త్రమే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సౌజన్య పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బలిజిపేట: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతికిరణ్మయి అన్నారు. ఆమె ఆధ్వర్యంలో పెదపెంకి గ్రామంలో శనివారం పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కాలువల్లో పూడికలు తొలగింపజేశారు.

కోటదుర్గమ్మ హుండీ ఆదాయం రూ.3.32 లక్షలు

పాలకొండ: పట్టణంలోని శ్రీకోటదుర్గమ్మ అమ్మవారి హుండీ లను శనివారం తెరిచి లెక్కించారు. ఏప్రిల్ 29 నుంచి నేటి వరకు రూ.3,32,757 లక్షలు ఆదాయం వచ్చినట్టు దేవదాయశాఖ జూనియర్ సహాయకురాలు వై.ఇందిర తెలిపారు. ఏఎస్‌ఐ ఎన్.నారాయణరావు పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాదశర్మ, సిబ్బంది, భక్తులు లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్నారు.



హుండీలను లెక్కిస్తున్న దృశ్యం

చిత్రలేఖనంపై అవగాహన

పాలకొండ: వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా శనివారం స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనంపై అవగాహన కల్పించారు. డ్రాయింగ్ మాస్టర్ జి.మురళి చిన్నారులకు ఆయిల్ పెయింటింగ్ ఎలా వెయ్యాల్లో వివరించారు. చిత్రలేఖనంలో మెలకువ లు నేర్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బబ్బురు గణేష్‌బాబు, సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై శ్రద్ధ చూపాలి



క్యారమ్స్ ఆడిస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పుస్తక పఠనంపై దృష్టి సారించాలని గ్రంథాలయ నిర్వాహకుడు నల్ల మధుసూదనరావు సూచించారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమంతో వివిధ పోటీలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి

పాచిపెంట: రాజకీయాలకు అతీతంగా క్రీడాకారులను ప్రోత్సహించాలని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ఈదుబిల్లి తిరుపతిరావు అన్నారు. గురువునాయుడు సమీపంలోగల గొలుగువలస దళిత క్రీడాకారులకు ఆయన శనివారం వాలీబాల్ కిట్లు ఉచితంగా అందజేశారు. క్రికెట్ కిట్లు కూడా అందజేస్తామని చెప్పారు.

ఇంటికి వెళ్లి పింఛన్ అందించాలి

వీరఘట్టం: మండలంలోని బ్యాంకు ఖాతాలో జమ చేయగా మిగిలిన 2,158 పింఛన్లను ఇంటింటికి వెళ్లి పింఛ నుదారులకు అందించాలని ఎంపీడీవో ఎంవీబీ సు బ్రహ్మణ్యం తెలిపారు. ఆయన ఆదివారం స్థానిక విలేక ర్లతో మాట్లాడారు. అధికారులు ప్రతిఒక్క పింఛనుదారు డు వద్దకు వెళ్లి పింఛను అందించాలన్నారు.